
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
సోమవారం 17 జూన్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 27.0





సోమవారం..పోదాం పోలవరం

నేడు సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పరిశీలన

సోమవారం రానే వచ్చింది. అయితే ఏంటంటారా ? లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కీలక బహుళార్థక సాధక ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తెలుగుదేశం అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతీవారాన్ని లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రతీ సోమవారం పోలవరం పైనే దృష్టి పెట్టి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి సుమారు 73 శాతం పనులను పూర్తి చేసిన ఘనత చంద్రబాబుది. గడిచిన ఐదేళ్లుగా ఈ వారం మారింది.. ప్రాజెక్టు పూర్తయ్యే ముహూర్తం పదేపదే మారింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి అదే సోమవారం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి ఆనవాయితీని కొనసాగించ బోతున్నారు. నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి ప్రాజెక్టు స్థలిలోనే ఉన్నతస్థాయి సమీక్షకు దిగుతున్నారు. ఇన్నాళ్ళు ఎడారిగా ఆర్చేసిన పోలవరానికి తిరిగి ఊపిరిపోసి పనుల్లో జీవం తెచ్చేందుకు తిరిగి ఉత్సాహం నింపేందుకు నేడు ఆరంభ సంకల్ప దినం.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- గడిచిన ఐదేళ్లల్లో పోలవరం సర్వనాశనం
- పోలవరం ఎత్తు తగ్గించినా నో అనని జగన్ సర్కార్
- నిర్వాసిత కుటుంబాలతోను చెడుగుడు
- కూటమి రాకతో పోలవరానికి పూర్వ కళ
- నేటి నుంచే మళ్లీ సోమవారం ఆనవాయితీ

పోలవరం ప్రాజెక్టు.. ఈ పేరు చెబితేనే యావత్ రాష్ట్ర రైతాంగం అప్రమత్తమవుతుంది. వేల కోట్లు వెచ్చించి కీలక పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేయించడంలో 2014-19 మధ్య అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు కంటిమీద కునుకు లేకుండా పనిచేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే పనులను కొలిక్కి తీసుకురాగలిగారు. దాదాపు 27 సార్లు పైగా పోలవరం ప్రాజెక్టు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి అక్కడికక్కడ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అటు కాంటాక్టు ఏజన్సీకి, ఇటు ఇంజనీర్లకు ఏ రోజుకా రోజు లక్ష్యాలు నిర్దేశించారు. పోలవరం పనుల్లో అనేక రికార్డులు గిన్నిస్‌కు ఎక్కాయి. మరిన్ని రికార్డు బ్రేక్‌లు చరిత్రలోనే నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఒకవైపు నిర్వాసితులను ఒప్పించి మెప్పించడమేకాకుండా ఎక్కడా పనులకు ఆటంకం లేకుండా సక్సెస్ అయ్యారు. మరోవైపు కేంద్రం నుంచి తగిన నిధులు రాబట్టేందుకు శత విధాలా ప్రయత్నించారు. ఫలితంగా ప్రధాన డ్యాం నిర్మాణానికి అనువైన పరిస్థితులను అప్పట్లోనే ఆయన తేగలిగారు. ఒకవైపు ఎగువ కాఫర్ డ్యాం, ఇంకోవైపు దిగువ కాఫర్ డ్యాం నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అందరినీ పరుగులు పెట్టించారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగు, తాగునీరు అందేలా నిత్య సమీక్షలతో జాగ్రత్తలు తీసుకున్నారు. ఆంధ్రుల జీవనాడిగా ప్రాజెక్టుకు నామకరణం చేసి అనుకున్న లక్ష్యాలకు చేరేందుకు ఎక్కడా జాప్యంకాని, సాంకేతిక లోపం లేకుండా చేయడం ఇంకో ఎత్తు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు పోలవరంపై దృష్టి పెట్టి క్షణం తేడా లేకుండా పనులు పూర్తి చేసేందుకు ప్రయ త్నించారు. కేంద్రం నుంచి నిధులు ఆలస్యమైనా ఆలోపే రాష్ట్ర బడ్జెట్ నుంచి కొంత భరించి మరీ పనుల్లో జాప్యాన్ని తగ్గించగలిగారు. ప్రతీసారి అత్యంత ఆధునిక పద్ధతుల్లోనే ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగుతూ వచ్చింది. ఎర్త్ కం రాక్‌ఫిల్‌డ్యాం నిర్మాణంలో భాగంగా ముందస్తుగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. జర్మనీకి చెందిన బావర్ కంపెనీ డయాఫ్రంవాల్ నిర్మాణంలో కీలక పాత్ర వహించింది. దీని నిర్మాణం పూర్తయిన వెంటనే ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పనులు చకచకా సాగాయి. ఇంకోవైపు జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పనులు పరుగులు పెట్టించారు. ఈ విద్యుత్ కేంద్రం ద్వారా ఉత్పత్తయిన దానిలో రాష్ట్ర అవసరాలు పోను పొరుగు రాష్ట్రాలకు విక్రయించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు ఎక్కడా అసంతృప్తి ఎదురుకాకుండా అధికార యంత్రాంగాన్ని ముంపు గ్రామాల వైపు నడిపారు. పరిహారం విషయంలో ఎలాంటి లోటు లేకుండా జాగ్రత్తపడ్డారు. కొన్నిచోట్ల న్యాయపరమైన వివాదాలు ఎదురైనప్పుడు తప్ప మిగతా అన్నిచోట్ల పరిష్కారం దిశగానే దిగువ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేసింది. దటీజ్.. చంద్రబాబు అనే దిశగా ఒకవైపు ప్రాజెక్టు నిర్మాణ పనులు, ఇంకోవైపు సహాయ పునరా వాస కార్యక్రమాలను కొనసాగించ గలిగారు. ఇంకొంతకాలం ఇదే రీతిలో పనిచేస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యి ఉండేది. అప్పటి జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా అత్యధిక సార్లు ప్రాజెక్టును సందర్శించి పనులను సమీక్షించగలిగారు. సీఎం హోదాలో చంద్రబాబు 2019 జనవరి 7వ తేదీన చివరిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు.



పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది

జగడాల జగన్‌తో ఒరిగిందేంటి ?

తెలుగుదేశంను కాదని 2019లో వైసీపీని అధికారంలోకి తెచ్చారు. పర్యావసానంగా సవ్యంగా సాగుతున్న పోలవరం ప్రాజెక్టుకు మహర్దశ కల్పించాల్సింది పోయి.. అష్ట దరిద్రం దాపురించేలా చేశారు. కేంద్రం అడుగులకు మడుగులొత్తుతూ ఇచ్చిన దాంతోనే సరిపెట్టుకుంటూ పోలవరంపై పరోక్షంగా కసి తీర్చుకున్నారు. ఈలోపే 2020-21లో కరోనా విజృంభించడం, ప్రాజెక్టు నిర్మాణ పనుల కార్మికులు, అధికారులు, సిబ్బంది అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఆ తర్వాత 2022 నుంచి పోలవరం పనులు ముందుకు సాగక పోగా లిచిపోయాయి. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41.75కు కుదించడంతోపాటు ప్రాజెక్టు వ్యయాన్ని 55 వేల కోట్ల నుంచి 31 వేల కోట్లకు తగ్గించినా ఎవ్వరూ నోరెత్తలేదు. ఒక్క తెలుగుదేశం ఇదేం లెక్క. ప్రాజెక్టును ఏం చేయబోతున్నారంటూ నిలదీసినా అంతా తామే నిర్మాణం పూర్తి చేసే దమ్మున్న వాళ్ళమన్నట్టుగా వైసీపీ మంత్రులు పోజులు కొట్టి ఇంకోవైపు చంద్రబాబును ఎద్దేవా చేస్తూ వచ్చారు. 2021-22 సంవత్సరాల్లో గోదావరికి వచ్చిన భారీ వరదలు అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్‌ను దెబ్బతీశాయి. ఇంకోవైపు గైడ్‌బండ్ కుంగేలా పరిణామాలు చోటు చేసుకున్నా.. వీటిని జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా పోలవరం పనులపై కేంద్ర బృందాలు తూతూ మంత్రంగా సందర్శించడం, కొన్ని నివేదికలతోనే సరిపెట్టాయి. కాని గడిచిన ఐదేళ్లుగా మూడు సార్లు ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ ముహూర్తాలు పెట్టి రైతులను మోసగించారు. ఇంకోవైపు పోలవరం నిర్మాణానికి త్యాగాల కోర్చిన నిర్వాసిత కుటుంబాలతో చెడుగుడు ఆడారు. వ్యక్తిగత పరిహారం పది లక్షలు చెల్లించి తీరుతామని చెప్పి దాగుడు మూతలాడారు. సీఎం హోదాలో జగన్ కేవలం మూడుసార్లు ప్రాజెక్టును నామ్‌కా వాస్తే సందర్శించి సరి పెట్టేశారు. 2014-19లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పనులను పరుగులెత్తిస్తే.. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు వెనుకబడేలా రికార్డు సృష్టించగలిగింది.



హెలీప్యాడ్ వద్ద తనిఖీలు

• చంద్రబాబు పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరతారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు పోలవరం ప్రాజెక్టును ఆసాంతం పరిశీలిస్తారు. కుంగిన గైడ్‌బండ్‌తో పాటు నిలిచిపోయిన అన్ని పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.05 నుంచి 3.05 గంటల వరకు ప్రాజెక్టు అధికారులతో గంటపాటు సమీక్షిస్తారు. సహాయక పునరావాస చర్యలు, భూసేకరణ అంశాలు ఇప్పటికే నిలిచిపోయిన వైనాన్ని తదుపరి తీసుకోవాల్సిన చర్యలపైన సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.40 వరకు మీడియా సమావేశం నిర్వహించి, 4 గంటలకు పోలవరం నుంచి ఉండవల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

త్యాగాలు చేసింది ఇందుకేనా ?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందేది. వందల గ్రామాల్లో దాహార్తిని తీర్చేది. కాని ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా తమ సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరగనేలేదు. 2019-24 మధ్య పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమాంతరంగా ముంపు గ్రామా ల్లో నిర్వాసిత సంఖ్యను కుదించి ఆ దిశగానే కొత్త ప్రణాళికను సిద్ధం చేశారు. ఇంకోవైపు చంద్రబాబు పాలనలో నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన ప్రత్యేక కాలనీల నిర్మాణం అప్పట్లో చకచకా సాగింది. అప్పటి కలెక్టర్ కాటంనేని భాస్కర్ కంటిమీద కునుకు లేకుండా నిర్వాసితుల కాలనీల నిర్మాణానికి జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం ప్రాంతాల్లో తరచూ విజిట్‌కు వెళ్ళేవారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ తరహా పరిస్థితిని గాలిలో పెట్టింది. అంతకంటే మించి వైసీపీ అధికారంలోకి రాకమునుపు జగన్ నిర్వాసిత కుటుం బాల్లో వ్యక్తిగత పరిహారాన్ని పది లక్షలకు పెంచుతూ హామీ లు ఇచ్చారు. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కూడా 2022 చివర్లో ప్రత్యేక జీవోలు జారీ చేశారు. ఇంత చేస్తే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో ఇవేవీ చేరనేలేదు. అధికారులు మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారు. గోదావరికి వరదలొచ్చినప్పుడు కుక్కునూరు, వేలేరుపాడులలో పర్యటించి సీఎం జగన్ ...

- మిగతా 6లో

నాడు అవమానం

జగన్ పాలనలో అందరూ అవమానాల పాలైన వారే. అడ్డగోలుగా అణచివేతకు గురైనవారే. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు నాయుడునూ జగన్ ప్రభుత్వం వదలలేదు. 2022, డిసెంబరు1.. ఆనాడు పోలవరం పనులు ఎందుకు చేపట్టలేకపోయారు..? మరెందుకు నీరు గారుస్తున్నారు.. ఇప్పటి వరకు ఏం చేశారో తేల్చికుంటామంటూ చంద్రబాబు నేరుగా పట్టిసీమ నుంచి పోలవరం వైపు బయల్దేరారు. ఈ క్రమంలోనే పోలవరం గ్రామ సమీపంలో ఉన్న ప్రాజెక్టు ముఖద్వారం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డగించి వెళ్లడానికి వీల్లేదని శాసించారు. దీంతో చంద్రబాబు భగ్గుమన్నారు. తీవ్ర స్వరంతో తనను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ పోలీసు అధికారులను నిలదీశారు. ప్రతిపక్ష నేతగా, మాజీ సీఎంగా పోలవరం ప్రాజెక్టును సందర్శించే అధికారం తనకు ఉందని, అడ్డుకునే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారంటూ తీవ్ర స్వరంతో విరుకుపడ్డారు. జగన్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా నడిరోడ్డుపై బైఠాయించారు. దీంతో అవ్వాక్కయిన పోలీసులు ఆయనకు సర్ది చెప్పేం దుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. మిగతా తెలుగు దేశం నేతల సమక్షంలోనే అంతా కలసి నడిరోడ్డుపై గంటన్నర పైగా బైఠాయించారు. ప్రభుత్వానికి తెలియజేయండి అప్పటి వరకు కదలనంటూ భీష్మించారు. అనాడు చంద్రబాబును జరిగిన అవమానాన్ని, పోలీసుల అడ్డగోలు తనాన్ని వైసీపీ ఎక్కడా ఖండించకపోగా అనాటి జల వనరుల శాఖ మంత్రి అనిల్ కుమార్ ఎకసెక్కంగా వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు సీఎం హోదాలో చంద్రబాబు 28వ సారి పోలవరం సందర్శనకు వస్తున్నారు.



పోలవరంలో రోడ్డుపై బైఠాయించిన బాబు (ఫైల్)

రేపటినుంచి దివ్యాంగుల నిర్ధారణ వైద్యశిబిరాలు

- నియోజక వర్గాల వారీగా షెడ్యూలు విడుదల చేసిన సమగ్రశిక్ష ఏపీసీ

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 16 : జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో వున్న ప్రాంతాల్లో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాలను నిర్వహించడానికి సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ బి.సోమశేఖర్ ఆదివారం షెడ్యూలు విడుదల చేశారు. ఈ నెల 18న పోలవరం నియోజకవర్గానికి సంబంధించి బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, పోలవరం, టి.నరసాపురం, వేలేరుపాడు, కొయ్యలగూడెం మండలాల దివ్యాంగులకు బుట్టాయిగూడెం జడ్పీ హైస్కూలులో మెడికల్ క్యాంపు నిర్వహిస్తారు. 20న చింతలపూడి నియోజకవర్గానికి సంబంధించి జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం మండలాలకు చింతలపూడి జడ్పీ హైస్కూలులో క్యాంపు జరుగుతుంది. 22న నూజివీడు నియోజకవర్గానికి సంబంధించి అగిరిపల్లి, నూజివీడు, చాట్రాయి, ముసునూరు మండలాల వారికి నూజివీడులోని ఎస్ఆర్ఆర్ జడ్పీ హైస్కూలులో క్యాంపు ఉంటుంది. 25న కైకలూరు నియోజకవర్గానికి సంబందించి కలిదిండి, కైకలూరు, మండవల్లి మండలాలకు కైకలూరులోని భవిత కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహిస్తారు. 27న ఉంగుటూరు నియోజకవర్గానికి సంబంధించి భీమడోలు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు, ద్వారకా తిరుమల మండలాలకు ఉంగుటూరులోని జడ్పీ హైస్కూలులో జరుగుతుంది. 29న దెందులూరు నియోజకవర్గానికి సంబంధించి పెదపాడు, దెందులూరు, పెదవేగి మండలాలకు దెందులూరులోని జడ్పీ హైస్కూలులో మెడికల్ క్యాంపు నిర్వహిస్తారు. జూలై 2న ఏలూరు నియోజకవర్గానికి సంబంధించిన వైద్య శిబిరాన్ని ఏలూరులోని అశోక్‌నగర్ భవిత కేంద్రం/అశోకవర్థిని మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తామని ఏపీసీ సోమశేఖర్ తెలిపారు. వైకల్య నిర్ధారణ జరిగిన తర్వాత అర్హత గలవారికి తగిన ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. క్యాంపునకు హాజరయ్యే పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఉచిత భోజన వసతితో పాటు, రవాణా ఖర్చులను చెల్లిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6-18 ఏళ్ల వయస్సు గల దివ్యాంగ బాలబాలికలు ఉచిత ఉపకరణాల పంపిణీకి అర్హులని వివరించారు.



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో సూర్యతేజ

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

పోలవరం/ఏలూరు క్రైం, జూన్ 16 : ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు సోమవారం రానున్న నేపథ్యంలో ఆదివారం ప్రాజెక్టు వద్ద జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేశారు. భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో భారీగా పోలీస్ యంత్రాంగం, ప్రత్యేక పోలీసు బలగాలు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నాయి. సీఎం పర్యటించనున్న అన్ని ప్రాంతాలకు క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా దళాలు హెలీకాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. భద్రత ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా కట్టుదిట్ట చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర భద్రతా అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు చుట్టూ 25 కిలోమీటర్ల మేర ప్రత్యేక పోలీసు బలగాలు జల్లెడ పట్టాయి. డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా స్పెషల్ పార్టీ పోలీసులతో తనిఖీలు చేపట్టారు. మొత్తం 1300 మంది పోలీసులను వినియోగిస్తున్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 70 మంది ఎస్ఐలు, 1195 మంది హెడ్ కానిస్టేబుళ్ళు, ఎఎస్ఐలు, ఎఆర్ సిబ్బంది, కానిస్టేబుళ్ళు స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ ఆధ్వర్యంలో వందమంది పారిశుధ్య కార్మిక సిబ్బంది పారిశుధ్య మెరుగుదల కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు కార్యాలయం, హిల్‌వ్యూ ప్రాంతంలో చెత్తను, పొదల్ని తొలగించారు. టీడీపీ పాలనలో ప్రాజెక్టు కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన 24 గంటల కాంక్రీట్ గిన్నిస్ రికార్డు పైలాన్, మంత్రివర్గ పైలాన్, తొలి రేడియల్ గేట్ పైలాన్‌లను శుభ్రం చేసి రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జేసీ, ఐటీడీఏ పీవో

పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి : మంత్రి నిమ్మల

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి, పీవో సూర్యతేజ ఇతర అధికారులతో సమీక్షిస్తూ సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు.

ఎలాంటి లోటుపాట్లు రానీయొద్దు : ఎమ్మెల్యే చిర్రి

సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పర్యటన ఏర్పాట్లలో అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని, ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. ఆదివారం పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల సుదీర్ఘ విరామానంతరం చంద్రబాబు ప్రాజెక్టు పరిశీలనకు రానున్నారని, ప్రాజెక్టు నిర్మాణం పనులు వేగవంతంగా చేసేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేసుకుని అధికారులు తమకు సహకరించాలన్నారు.

అధికారులతో జేసీ సమీక్ష

సీఎం పర్యటన నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలని జేసీ లావణ్యవేణి అధికారులకు సూచించారు. ఆదివారం పోలవరం ప్రాజెక్టు వద్ద చేస్తున్న భద్రతా ఏర్పాట్లు స్వయంగా పరిశీలించారు. సీఎం పర్యటించనున్న స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, పవర్ హౌజ్, డయాఫ్రంవాల్, గైడ్ బండ్, డ్యాం సీపేజీ, లీకేజీ ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సంబంధిత విషయాలపై పలు సూచనలు చేశారు. తొలుత ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన అధికారుల సమీక్షలో జేసీ మాట్లాడుతూ ఫొటో ఎగ్జిబిషన్, బారికేడింగ్, తాగునీరు, టెంట్లు, మెడికల్ క్యాంపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమీక్షలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎస్పీ మేరీ ప్రశాంతి, ఐటీడీఏ పీవో సూర్యతేజ, జనసేన ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శి గడ్డమణుగు రవి కుమార్, గునపర్తి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి ఆలయ ప్రాంగణములో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూన్ 16: చిన్నతిరుపతిగా ఖ్యాతి గాంచిన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 18 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. ముందుగా వీరంతా ఆలయంలో మొక్కుబడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాతావరణం కాస్త ఎండగా, ఉక్కబోతగా ఉండడంతో దర్శనానంతరం పలువురు అనివేటి మండపంలో సేదతీరారు.

ముగిసిన కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ద్వారకాతిరుమల, జూన్ 16: త్రయాహ్నిక దీక్షతో జరుగుతున్న క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. శ్రీవారి ప్రధానాలయానికి ఉపాలయమైన ఈ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని మరింత శోభాయమానంగా అలంకరించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవ మూర్తులకు నవకలశస్నపన. శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ. శ్రీమహా పూర్ణాహుతి హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక అలంకారాల్లో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.

మావుళ్ళమ్మకు వెండి శంఖం బహూకరణ



అమ్మవారికి శంఖం బహుకరిస్తున్న భక్తులు

భీమవరం టౌన్, జూన్ 16 : మావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన మద్దిరాల ఈశ్వర శ్రీహర్ష అమ్మవారి అభిషేకానికి 400 గ్రాముల వెండి శంఖం బహుకరించారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా, వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం త రుపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

బంగారు చీరకు రూ.11 వేలు అందజేత

● చెన్నై వాస్తవ్యులు వేదపండితులు కామశాస్త్రిఘనపాఠీ, భారతి దంపతులు అమ్మవారి బంగారు చీర నిమిత్తం రూ.11 వేలు అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకోగా ఉప ప్రధానార్చకుడు కొడమంచిలి కోప్పేశ్వర రావు అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు.

ఎన్నికల కోడ్ ముగిసినా తొలగని ముసుగు



నెహ్రూ విగ్రహానికి తొలగించని ముసుగు

ఆకివీడు, జూన్ 16: ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు దాటుతున్న విగ్రహాలకు వేసిన ముసుగులు ఇంకా తొలగించలేదు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఈ నెల నాలుగున ఫలితాలు వచ్చిన తరువాత ఆరో తేదీతో కోడ్ ముగిసింది. విగ్రహాలకు వేసిన ముసుగులు ఎండకు ఎండి, ఈదురు గాలులకు సగం సగం ఊడిపోయాయి. కొన్నిచోట్ల విగ్రహాలకు ఆయా పార్టీల నేతలు తొలగించుకున్నారు. స్థానిక నెహ్రూ సెంటర్‌లో నెహ్రూ విగ్రహానికి వేసిన ముసుగు నేటికి తొలగించలేదు. మూడుసార్లు ప్రధానిగా చేసిన నెహ్రూ విగ్రహానికి వేసిన ముసుగు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పాట రూపంలో బాలు జీవించే ఉన్నారు



బాలు గానామృతంలో పాటలు పాడుతున్న చిన్నారి

ఏలూరు కల్చరల్, జూన్ 16: రాగం, తానం, పల్లవి శ్వాసగా బాలు జీవించారని, గాన గంధర్వుడు మనమధ్య లేకపోయినా పాట రూపంలో ఎప్పటికి మన హృదయాల్లో జీవించే ఉంటారని, పలువురు వక్తలు కొనియాడారు. నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారులకు సినిమా పాటల పోటీలు నిర్వహించారు. సంగీత దర్శకుడు, ఎస్‌పీఎస్ సంస్థ అధినేత ఎస్‌పీఎస్ వాసు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాలు పాట, బాలుడి నోట సాంస్కృతిక కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను పలువురు గాయనీ గాయకులు ఆలపించారు. తదుపరి బాలు పాడిన పలు గీతాల ఆధారంగా రూపొందించిన బాలు గానామృతం ఆడియో ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాటాడుతూ కళాకారులు మరణించినా చిరంజీవులే అన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, వైఎంహెచ్‌ఏ సభ్యులు, ఎస్‌పీఎస్ వహిదా వాసు పర్యవేక్షించారు.

జేసీఐ సభ్యులకు 152 రకాల రుచులు



152 రకాల వంటకాలు చూసి ఆశ్చర్యపోతున్న రికేష్ శర్మ

భీమవరం టౌన్, జూన్ 16 : జూనియర్ చాంబర్ ఇంటర్‌నేషన్‌లో (జేసీఐ) ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రికేష్ శర్మ ఆదివారం వార్షిక పర్యటనలో భాగంగా భీమవరం వచ్చారు. వారికి భీమవరం రుచులను చూపించారు. పట్టణానికి చెందిన పేరిచర్ల కృష్ణంరాజు సుమారు 152 రకాల వంటకాలతో స్వీట్స్, హాట్స్, వేజ్ అండ్ నాన్ వేజ్ బిర్యానిలు, ఫ్రూట్స్, వేజ్ అండ్ నాన్ వేజ్ పచ్చళ్ల మరెన్నో వంటకాలను రుచి చూపించారు. వంటకాలు చూసిన రికేష్ శర్మ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇన్ని రకాల వంటకాలను ఒకే చోట చూడటం ఇదే మొదటి సారన్నారు. నడింపల్లి మహేష్ కుమార్ వర్మ ఉన్నారు.

చిల్లిగవ్వ ఇవ్వలేదు



» నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు » కూటమి విజయంతో సుపరిపాలనకు మోక్షం
» హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు

ఏలూరు రూరల్, జూన్ 16: వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గ్రామ పరిపాలనకు అడ్డంకులు తొలగినట్లేనని మెజార్టీ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను నాటి సీఎం జగన్ సొంత పథకాలకు మళ్ళించారు. దీంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం కొందరు సొంత డబ్బులను వెచ్చించారు. తెలుగుదేశం పార్టీ మద్దతు సర్పంచ్‌లు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచి రోజులు రాకపోతాయా అని అవమానాలు భరిస్తూ కాలం గడిపారు. వైసీపీ సర్పంచ్‌లు పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. గెలిచాం ఇంకా అంతా తమదేనని భావించిన వారికి జగన్ చుక్కలు చూపించారు. పైసా నిధులు లేక ప్రజలకు ముఖం చూపించలేకపోయారు. సర్పంచ్ అని చెప్పుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

అదో పీడకల

రాష్ట్రానికి సీఎం ఎలాగో, పంచాయతీకి సర్పంచ్ అలా అంతటి కీలకమైన పదవి వైసీపీ పాలనలో పవర్ కట్ అన్నట్లుగా మారిపోయింది. పంచాయతీ ఖాతాలో పైసా లేకపోవడంతో తమకు ఓట్లు వేసిన జనం కనీస అవసరాలను కూడా సర్పంచ్‌లు తీర్చలేకపోయారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి వాటికి నిధులు కొరత వేధించింది. కొంతమంది సర్పంచ్‌లు సొంత డబ్బును వెచ్చించారు. ప్రజలకు ముఖం చూపించలేక అప్పులు తెచ్చి చేతులు కాల్చుకున్నారు. నెత్తినోరుబాదుకున్నా జగన్ కరుణించలేదని, గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని గమనించిన టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు ఇక మేలు చేస్తారని సర్పంచ్‌లు భావిస్తున్నారు. పల్లెల్లో పరిపాలన గాడిన పడుతుందని, తమకు తగినన్ని నిధులు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో తాజా పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక కోరింది. పంచాయతీల వనరులు, పన్నులు, నిధులు ఖర్చు కేటాయింపులు, తదితర వివరాలు అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా అధికారులు నివేదిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

నిధుల మళ్లింపు

పంచాయతీల ఖాతాల్లో పైసా లేకపోగా ఆదుకుంటామని భావించిన కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం నవరత్నాలకు జగన్ మళ్ళించారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి రూ.8,629 కోట్లు రాగా పంచాయతీలకు పైసా ఇవ్వలేదు. మొత్తం సొమ్మును పథకాలకు మళ్ళించారు. దీంతో పంచాయతీల అభివృద్ధి అటకెక్కింది. ఉమ్మడి జిల్లాలోని 964 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కేవలం 15 శాతం మంది టీడీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. మిగిలిన సర్పంచ్‌లు వైసీపీ మద్దతుదారులే. అయినా జగన్ కనికరం చూపలేదు. సొంత పార్టీ సర్పంచ్‌లకు హ్యాండ్ ఇచ్చారు.

పైసా ఇవ్వలేదు



వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వలేదు. పంచాయతీల పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ ఫండ్ కూడా రాలేదు. పన్నుల రూపంలో అంతో ఇంతో వచ్చిన సొమ్మును విద్యుత్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చింది. అభివృద్ధి చేయాల్సి వస్తే సర్పంచ్‌లు సొంతంగా చేయాల్సిందే. - కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు

ఇక మంచి రోజులే



టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంలో కూడా టీడీపీ భాగస్వామ్యం అయినందున నిధులు మరిన్ని వస్తాయి. రాష్ట్ర నిధులతో పాటు కేంద్రం నిధులు వస్తాయి. అభివృద్ధికి ఎక్కువ తెచ్చుకునే వెసులుబాటు ఉంది. పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి సమస్య ఉండదు. - పాలడుగుల లక్ష్మణరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి

» రిటైర్డ్ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ » కొనసాగుతున్న రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఏలూరు టూ టౌన్, జూన్ 16 : రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పీవీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలు ఆదివారం టొబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో రెండో రోజు కొనసాగించారు. వ్యవసాయ రంగ సంక్షోభం, పాలకుల విధానాలు, మన కర్తవ్యాలు అంశంపై వక్తలు మాట్లాడారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పితేనే వలసలు అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే మార్గమని అన్నారు. పదేళ్లలో రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం, కార్పొరేట్లకు రూ.25 లక్షల కోట్ల రుణాలు రద్దు చేసిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కూడా చెల్లించకుండా లక్షల కోట్ల నష్టానికి గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో 19 కోట్ల రైతు కుటుంబాలకు కుటీర పరిశ్రమలకు ఇచ్చిన రుణాల కన్నా కేవలం 20 కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణాలే ఎక్కువన్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు కట్టాల్సిన రూ.28 లక్షల కోట్లు వసూలు చేశారా అని ప్రశ్నించారు. సన్న, చిన్నకారు రైతులు ప్రభుత్వం సహకరించక ప్రైవేటు వడ్డీ మూడు రూపాయలకు తీసుకొచ్చి రుణాల్లో కూరుకుపోతున్నారని అన్నారు. ప్రభుత్వం పంటల బీమా కంటే ఇన్సూరెన్స్ కంపెనీలకే ఎక్కువ మేలు చేస్తున్నాయని అన్నారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో లక్షలాదిగా ఉన్న ఉద్యోగాలను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయడం లేదన్నారు. రైతాంగ సమితి నాయకులు డాక్టర్ రాజమోహన్ భారత రాజ్యాంగ ఉద్యమం కనీస మద్దతు ధర అంశం పై వివరించారు. ఢిల్లీలో రైతుల సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి ఉద్యమాలు చేసి వందలాది మంది ప్రాణాలర్పించారని అన్నారు. దీని ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయక తప్పలేదన్నారు. ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాల్, కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు, రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు పాల్గొన్నారు.



కొల్లేరు నుంచి పట్టణంలోకి వచ్చిన కిక్కిస రేణువులు



నిర్మానుషంగా ఉన్న జాతీయ రహదారి

మండిన సండే

» భానుడి భగభగలు
» నిర్మానుషంగా ప్రధాన రహదారుల

ఆకివీడు, జూన్ 16: సూర్యుడు సండే రోజున నిప్పులు చెరిగాడు. వర్షాకాలం మొదలైన రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అడపా దడపా చిరుజల్లులు పడుతున్నా గుబురెండతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు కొల్లేరులో కిక్కిస్ అంటించడంతో వేడిగాలుకు ప్రజలు భయపడి పోతున్నారు. ఎండ వేడికి ప్రధాన రహదారి జనసంచారం లేక నిర్మానుషంగా మారింది. వాహనాల రాకపోకలు తగ్గాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గిపోవడం, వేడి విపరీతంగా పెరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే మెయిన్ సెంటర్‌లో ఆదివారం జన సంచారమే లేదు. బేరాలు లేకపోవడంతో వ్యాపారులు దుకాణాలు మూసేశారు. అత్యవసర పనుల నిమిత్త బయటకు రావాలంటే తగు జాగ్రత్తలతో పనులు ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు. శీతల పానీయాలు, పండ్ల రసాలతో ప్రజలు, భుజబలరాయుడు మంచినీటి చెరువుగట్టున గోవులు, ఆబోతులు సేదతీరుతున్నాయి.

గాలివాన బీభత్సం



పెదతాడేపల్లిలో రోడ్డుపై కూలిన చెట్లు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16: తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం నుంచి గంటన్నర పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రజలను వణికించింది. పట్టణంలో పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడగా, కడియద్దలో సెంటర్‌లో గాలికి విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. పంట చేలన్నీ ఆకు మడుల దశలో ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విద్యుత్ సిబ్బంది తెగిన విద్యుత్ వైర్లు, ఒరిగిన స్తంభాలను పునరుద్ధరిస్తున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇరువురి మృతి

చింతలపూడి, జూన్ 16: చింతలపూడి మండలం మేడిశెట్టివారిపాలెం గ్రామంలో పామాయిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై దారబోయిన శ్రీనివాసరావు (32) దుర్మరణం పాలయ్యాడు. ఉదయం తోటలో గెలలు కోస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ తీగల మీద పడడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అతడని ఆసుపత్రికి తరలించటానికి ప్రయత్నించగా మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కుటుంబరావు తెలిపారు.

● చింతలపూడి : పోతునూరి గ్రామంలో పాముకాటుకు గురై తలపనేని వెంకటేశ్వరరావు (75) మృతి చెందాడు. ఉదయం నీరు వదలటానికి మోటారు ఆన్ చేయటానికి ప్రతిరోజూ వెళ్ళినట్లే ఈ రోజు కూడా వెళ్లాడు. అయితే ఏదో పురుగు కుట్టినట్లు అనిపించి కొద్దిసేపటి తరువాత పడిపోవడంతో అతన్ని చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

● ఏలూరు క్రైం : గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాల పక్కన మృతి చెంది ఉన్నాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ డి.నరసింహారావు ఆదివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని ఆటో నగర్ రైల్వే బ్రిడ్జి కింద సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు వయస్సు కలిగిన మృత దేహం ఉంది. మృతుడు 5.5 అడుగుల ఎత్తు కల్గి ఆలివ్ గ్రీన్ రంగు పొట్టి చేతుల టీ షర్టు, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎటు వంటి ఆధారాలు లభించలేదు. రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడా మరే ఇతర కారణాలతో మరణించాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఉండి : ఇంటి పైకప్పు దూలానికి ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇవే. ఉండి గ్రామం వెలివర్రు రోడ్‌లో నివశిస్తున్న గండికోట రామస్వామి(25) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇతని భార్య కేరళలో వుంటుంది. సంతానం లేరు. ఉరి వేసుకుని చనిపోవడానికి కారణాలు తెలియవలసి వుంది. ఇతని సోదరుడు గండికోట దుర్గాప్రసాదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఏఎస్‌ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడుచోట్ల అగ్ని ప్రమాదాలు



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దగ్ధమవుతున్న పచ్చగడ్డి

ఆకివీడు, జూన్ 16: పట్టణం, మండలంలోని మూడుచోట్ల ఆదివారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. స్థానిక సబ్ స్టేషన్ నుంచి నిప్పులు నేలపై పడడంతో గడ్డి అంటుకుంది. ఎండకు ఎండి ఉండడంతో పచ్చగడ్డి కూడా అంటుకుని మంటలు చెలరేగడంతో, సంబంధిత అధికారులు సరఫరా నిలిపి వేసి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అజ్జమూరు గరువులో ఉన్న ఇరిగేషన్ డ్రైనేజీ (ఆర్ అండ్ బీ బంగ్లా) కార్యాలయాల ప్రాంగణంలో పాత రికార్డులు, కోళ్ల వర్రులో గడ్డివాము అంటుకొన్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎండలు విపరీతంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరావు తెలిపారు.

వృద్ధుడి ఆచూకీ లభ్యం



ముదినేపల్లి, జూన్ 16 : మండలంలోని దేవరంలో చేపల చెరువుపై కాపలా ఉంటూ ఈ నెల 13న అదృశ్యమైన అత్తిలికి చెందిన దండు శ్రీరామరాజు (76) అనే వృద్ధుడి ఆచూకీ లభ్యమైంది. చెరువు వద్ద తాడు తెంచుకుని పారిపోతున్న ఆవును పట్టుకునేందుకు వెళ్లిన ఆ వృద్ధుడు వడాలి గ్రామం వరకు వెళ్లి తిరిగిరాని విషయం తెలిసిందే. అక్కడ నుంచి దారి తప్పి చినగొన్నూరు మీదుగా గుడ్లవల్లేరు చేరుకొని శనివారం సాయంత్రం గుడివాడ చేరుకున్నాడు. గుడ్లవల్లేరులో ఆ వృద్ధుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తుండగా, ఫొటో చూసిన ఒక వ్యక్తి తెలిపిన సమాచారం మేరకు గుడివాడలో శ్రీరామరాజును కనుగొన్నారు. ఆదివారం సాయంత్రం దేవరంలోని ఇంటికి తీసుకొచ్చారు.

అప్పు గొడవలో వ్యక్తి దారుణ హత్య



మృతుడు రాము

తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: అప్పుగా తీసుకున్న నగదు తీర్చాలనే గొడవలో మధ్యలో వచ్చిన వ్యక్తి బలైన ఘటన మండలంలోని పడాలలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం మండలం పడాలకు చెందిన కొత్తా శ్రీను అదే గ్రామానికి చెందిన లింగంపల్లి నరసయ్య దగ్గర డబ్బులు అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చకపోవడంతో ఈ విషయం పెద్దల వరకూ వెళ్లింది. ఈ గొడవలు పది రోజులుగా జరుగు తున్నాయి. అయితే శ్రీను, భార్య సరస్వతి శనివారం రాత్రి లింగంపల్లి నరస య్య ఇంటికి వచ్చి ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న సరస్వతి సోద రుడు కొప్పర్తి రాము అనే రాంబాబు (48) మధ్యలో వెళ్లడంతో ఘర్షణ మరింత పెద్దదైంది. ఈ నేపథ్యంలో లింగంపల్లి నరసయ్య కుమారుడైన లింగంపల్లి మణికంఠ ఉద్రేకంలో ఇంట్లో ఉన్న గొడ్డలితో రాము, సరస్వతి, శ్రీనుపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రాము అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

మంత్రి అచ్చంనాయుడిని కలిసిన ఉపకులపతి



తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చంనాయుడిని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ ఆదివారం మంత్రి కేంప్ ఆఫీసులో మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం తరపున పుష్ప ప్రసాదం, ఉద్యాన ఉత్పత్తుల కిట్‌ను అందించి విశ్వవిద్యాలయ స్థితిగతులను వివరించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ స్వామి ఉన్నారు.

ఇతర దేశాల్లో కచేరిలు చేయడం అభినందనీయం



పిప్పళ్ళ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 16 : సంగీతంలో డిప్లొమో పొంది ఆధ్యాత్మిక సంగీతంతో దేశ విదేశాల్లో కచేరిలు చేసి ఆ దేశాల్లో అవార్డులు సన్మానాలు పొందిన ప్రసాద్ అభినందనీయులని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భూటాన్ దేశంలో పలు రాష్ట్రాల్లో వారి ఆహ్వానంపై వెళ్లి ఆ దేశాల్లో కచేరీలు చేసి అవార్డులు పొందిన భీమవరం సంగీత కళాకారులు పిప్పళ్ల ప్రసాద్‌ను ఎమ్మెల్యే అంజిబాబు కార్యాలయంలో ఆదివారం అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన ఇంట్లోనూ విశాఖపట్నంలోనూ తమ వియ్యంకులు నివాసంలో కూడా ప్రసాద్ సంగీత కచేరి చేశారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భూటాన్ దేశంలోని ఎకత్వా సచ్చిత్ సంస్థ కళాకారులను ఆహ్వానిస్తూ కచేరీలు ఇప్పించి అవార్డులతో సత్కరించడం వంటివి కొన్నేళ్లుగా చేస్తున్నారన్నారు. అనంతరం ప్రసాద్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, చెల్లబోయిన గోవింద్, విజ్జురోతి రాఘవులు, మైలబత్తుల ఐజాక్ బాబు, కొంద్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుతో ప్రజల్లో ఆనందం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 16: చంద్రబాబు నాయుడు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే హామీల మేరకు ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గెలుపు ఉత్సాహంతో ప్రతీకార చర్యలకు పాల్పడవద్దని సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్‌లో సూచించారని, కూటమి శ్రేణులంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం చంద్రబాబు పోలవరం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాం ప్రసాద్ చౌదరి, షేక్ బాజి, రాంలక్ష్మణ్, నల్లమిల్లి చినగోపిరెడ్డి, సురగాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీస్ తనిఖీలు



బస్సును తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 16 : జిల్లాలో రోడ్డు ప్రమదాల నివారణ, నేరనియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని రాష్ట్ర, జాతీయ, ఇతర రహదారులపై శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ పకడ్బందీగా గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు ప్రమదాల నివారణ కోసం డ్రైవర్లక ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సారా, మద్యం అక్రమ రవాణా జరుగకుండా అరికట్టేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా ఈ తనిఖీలు నిర్వహించారు. ఏటిఎం, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద అప్రమత్తంగా గస్తీని పోలీసులు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. రాత్రివేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఈ చర్యలను చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

ప్లాస్టిక్ వాడకం బాధాకరం

భీమవరం టౌన్,జూన్ 16 : విద్యావంతులు కూడా ప్లాస్టిక్ వస్తువులనే వాడడం బాధాకరమని రైతు బజార్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పర్యావరణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు బజార్‌లో రైతులు వినియోగదారులతో ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీ, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ మాట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించడానికి ప్రభుత్వం కొన్ని చట్టాలను చేసిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్లాస్టిక్ నిషేధ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైతులు నాగన్న, బొల్ల రాముడు, శ్రీరామూర్తి, మోటుపల్లి సత్యనారా యణ, వేలూరి విద్య సాగర్, ఎస్కే చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రోషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజీనామా చేసిన వలంటీర్లు

బలవంతంగా రాజీనామా చేయించారు

ఎమ్మెల్యే రోషన్‌కు వలంటీర్ల వినతి

జంగారెడ్డిగూడెం, జూన్ 16: నాలుగేళ్లు ప్రజలకు సేవలందించిన తమను రాజకీయ కారణాలతో వైసీపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు బలవంతంగా రాజీనామా చేయించారని పట్టణానికి చెందిన వలంటీర్లు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం వచ్చిన ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. రాజీనామా చేయకపోతే తిరిగి వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తామని బెదిరించడంతో రాజీనామా చేసినట్లు ఎమ్మెల్యేతో తెలిపారు. తాము విధుల్లో కొనసాగేలా సహకరించాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు విన్నవించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కె.సూర్యకళ, వసుంధర, కె.వెంకటలక్ష్మి, షేక్ జాస్మిన్, కె.వరలక్ష్మి, డి.శ్రీను, డి.ఝాన్సీ, షేక్ సలీమ్ ఉన్నారు.

● కుక్కునూరు: వైసీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోయామని, న్యాయం చేయండి అంటూ వలంటీర్లంతా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మునిశెట్టి నాగేశ్వరరావుకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు తమను బెదిరించి రాజీనామా చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలు తిరిగి వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి వై.సాయికిరణ్, హరినాథ్, కే.విజయ, సమ్మక్క, ఆదిలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం, జూన్16: తెలుగుదేశం కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. వేగవరంలో వైసీపీ కార్యకర్తల దాడిలో టీడీపీకి చెందిన షేక్ ఇమ్రాన్, పారేపల్లి శ్రీను గాయపడ్డారు. వారిని ఆదివారం ఎమ్మెల్యే రోషన్ కుమార్ పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధితులను ఆదుకుంటామన్నారు. మిషన్ హోప్ సంస్థ ద్వారా పారేపల్లి శ్రీను కుటుంబానికి రూ.10వేలు, ఎస్.కె. ఇమ్రాన్ కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. జగ్గవరపు ముత్తారెడ్డి ఇమ్రాన్ కుటుంబానికి రూ.5వేలు అందజేశారు.

రోషన్ కుమార్ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి జంగారెడ్డిగూడెం రావడంతో ఆయనకు కూటమి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ తనను గెలిపించిన ప్రజలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుతానన్నారు. గురవాయిగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వరకు ర్యాలీగా వెళ్లారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పలువురు అధికారులు ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్ర శేషు, రావూరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, అలపాటి దుర్గాప్రసాద్, కుక్కల మాధవరావు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, గుమ్మడి ప్రసాద్, మండవ లక్ష్మణరావు, రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, షేక్ ముస్తఫా, రాజాన పండు, సాయిల సత్యనారాయణ, మద్దిపాటి నాగేశ్వరరావు, అట్లూరి సురేష్, వలవల తాతాజీ, ఉమామహేశ్వరి, ఉక్కుర్తి సీతారామ్, కొప్పాక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి : చింతమనేని

పెదవేగి, జూన్ 16: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో దోమలు పెరిగి, వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వెంటనే పారిశుధ్యం మెరుగదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపట్టారు.

విద్యతో ఉన్నత స్థాయికి ఎదగాలి : ఎంపీ మహేష్


కర్నాటక పాఠశాలలో ఎంపీ మహేష్

ఏలూరు టూటౌన్, జూన్ 16: విద్యతో ఉన్నత స్థాయికి చేరవచ్చని, తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. కర్ణాటకలోని పీఎస్ఎస్ పీఎంఆర్ పాఠశాలలో మహేష్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. మహేష్ యాదవ్ చదువుకున్న పాఠశాలకు వెళ్లిన సందర్భంగా యాజమాన్యం ఘనంగా సన్మానించారు. మహేష్‌యాదవ్ మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలో చదువుకున్నందుకు వలనే ఈ స్థాయికి ఎదిగానన్నారు. పాఠశాలలో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తనకు విద్య నేర్పిన డీన్ మంజునాథ్, రిటైర్డ్ ప్రిన్సిపల్ వెంకటాచలం, వైస్ ప్రిన్సిపల్ కేవీఎస్.ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏలూరు నగర సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూటౌన్, జూన్ 16: గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నగరంలో ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని వాటిని పరిష్కరించాలని పీఏవో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్.హరినాథ్ ఎమ్మెల్యే బడేటి చంటిని కోరారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ఆదివారం హరినాథ్ ఎమ్మెల్యే చంటిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నగరంలో రోడ్లు, పార్కులు అధ్వానంగా తయారయ్యాయన్నారు. కృష్ణకాల్వను ప్రక్షాళన చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జూట్‌మిల్లు కుటుంబాల రక్షణకు చర్యలు తీసుకోవాలని, తూర్పు లాకులు, పడమర లాకులను పునర్నిర్మించాలని కోరారు. తమ్మి లేరుకు రక్షణ గోడలు నిర్మించాలని, టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి నిర్వాసితుల సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

బుట్టాయగూడెం, జూన్ 16: పోలవరం నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి పరిష్కరించాలని సీపీఎం నేతలు కోరారు. చంద్రబాబు నాయుడుకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వనున్నట్లు ఏపీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ తెలిపారు. ఆదివారం బుట్టాయగూడెంలో ఏజెన్సీ మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు సమగ్ర న్యాయం చేయాలని సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ చూపాలని కోరారు. జి.వెంకట్రావు, ఎం.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి అభ్యర్థుల వయోపరిమితిని పెంచాలి : డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ అధ్యక్షుడు శివశంకర్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 16: డీఎస్సీ నియామకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయోపరిమితి పెంచాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఏలూరులో ఆదివారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, మెగా డీఎస్సీలో 16,347 పోస్టులను మాత్రమే నోటిఫై చేశారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు మూడు నెలల వ్యవధిని పొడిగించాలన్నారు. ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీచేయాలని, ఉపాధ్యాయ పోస్టులు పెంచాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు సూర్యకిరణ్, దుర్గాప్రసాద్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

హేలాపురి లయన్స్‌క్లబ్ కమిటీ ప్రమాణస్వీకారం

ఏలూరు కల్చరల్, జూన్ 16: ఏలూరు నగరంలో సేవారంగంలో 47 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న సేవా సంస్థ హేలాపురి లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం స్వీకారం చేసింది. న్యూ అశోక్‌నగర్‌లోని హేలాపురి, లయన్స్ మల్టీసర్వీస్ సెంటర్లో ఆదివారం ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ప్రస్తుత అధ్యక్షుడు కె.బి రావ్ అధ్యక్షతన జరిగిన సభలో నూతన అధ్యక్షుడిగా పీవీ.రమణ, కార్యదర్శిగా సంకు సురేష్, కోశాధికారిగా డి.రమాదేవి ఎన్నిక అయ్యారు. ముఖ్య అతిథిగా పూర్వపు విజయవాడ జిల్లా లయన్స్‌గవర్నర్‌గా ఎంపికైన దామెర్ల శ్రీశాంతి కమిటీసభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ పి.సుభాష్‌బాబు, జిల్లా నాయకులు డాక్టర్ డి.సుబ్బారావు, ఎల్.వెంకటేశ్వరరావు, సత్యస్వరూప్, కె.శ్రీనివాస్, జి.మల్లిఖార్జునరావు, డాక్టర్ సరస్వతి, మాజీ గవర్నర్లు డాక్టర్ యార్లగడ్డ జగన్‌మోహన్‌రావు, మురళీ తదితరులు పాల్గొన్నారు. తొలుత నాట్యాచార్య, హేమసుందర్ శిష్యబృందం కూచిపూడి నాట్యప్రదర్శన అలరించింది.





నేడు పోలవారం

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

పోలవరం/బుట్టాయగూడెం, జూన్ 16: చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం పోలవరం జాతీయ ప్రాజెక్టు సందర్శనకు రావడంతో అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి సోమవారం పోలవారం పేరిట గతంలో సమీక్షలు చేసినట్లు ప్రస్తుతం అదే విధానం కొనసాగించనున్నారు. పోలవరం ప్రాజెక్ట్ త్వరితగతిన పూర్తిచేసేందుకు కార్యాచరణతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. చంద్రబాబు పర్యటనను తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు జయప్రదం చేయాలని నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రతి మండలం నుంచి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించి పోలవరం పూర్తిచేయడానికి ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారన్నారు. చంద్రబాబు పోలవరాన్ని పూర్తిచేస్తారని బొరగం అన్నారు.


కుంగిన గైడ్‌బండ్


ఎగువ కాఫర్ డ్యామ్


డయాఫ్రమ్ వాల్


పవర్ హౌస్


అభయాంజనేయుడికి పూజలు చేస్తున్న మంత్రి


ఎమ్మెల్యే చంటికి జ్ఞాపిక బహూకరణ


వెలమపేటలో కేక్‌కట్ చేస్తున్న అభిమానులు

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తాం

మంత్రి పార్థసారథి

పెదపాడు, జూన్ 16: కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకు వారి కోరికలను నెరవేరుస్తామని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామిని ఆదివారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేవారు. మంత్రి పార్థసారథికి ఆలయ అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కష్టపడి చేస్తున్నారన్నారు. ఘన విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చలమలశెట్టి రమేష్‌బాబు, వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీను, అట్లూరి రమేష్, దయాల రాజేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, అట్లూరి శ్రీనివాసరావు, సుంకర సుభాష్‌చంద్రబోస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటి ప్రత్యేక పూజలు

ఏలూరు టూటౌన్: రేవు లింగేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాలా సుమతి బాలాజీ దంపతుల ఆధ్వర్యంలో మూడో డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం పాండురంగ థియేటర్ వద్ద కనకదుర్గ రెడిమేడ్ యూనియన్ ఆధ్వర్యంలో చంటిని సన్మానించి కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో ఎం.పార్థసారధి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కూటమినేతల సంబరం

చింతలపూడి: వెలమపేటలోని బీసీ వెలమసామాజిక సంఘం ఆధ్వర్యంలో కూటమి విజయంతో సంబరం జరుపుకున్నారు. ఆదివారం ఉదయం తాండ్రపాపారాయుడు విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఎ.అప్పారావు మాట్లాడుతూ కింజారపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడును కేంద్ర, రాష్ట్ర మంత్రులను చేసిన చంద్రబాబుకు పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సావిత్రి బాయ్ పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, మన్నెం సత్యకుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

పెదవేగి: మహిళల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు చింతమనేనితో కలసి కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ప్రభాకర్ మాట్లాడుతూ నాడు వైసీపీ పాలన అరాచకం, అకృత్యాలతో సాగితే, నేడు టీడీపీ పాలనలో సంక్షేమం, అభివృద్ధి ఉంటాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ ఉంటుందని ప్రభాకర్ వివరించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు చింతమనేనిని కలసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

చంద్రబాబు గెలుపు, ప్రజల గెలుపు

లింగపాలెం: చంద్రబాబునాయుడు గెలుపు, ప్రజల గెలుపు తెలుగుదేశం నేతలు అన్నారు. మఠంగూడెంలో తెలుగుదేశంపార్టీ నేతలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రజలంతా అభివృద్ధి, సంక్షేమంవైపే మొగ్గు చూపారన్నారు. రాష్ట్రం అభివృద్ధిచెందాలన్నా, పోలవరం ఉరుకులు పెట్టాలన్నా అమరావతి ముందుకు సాగాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. జాస్తి శ్రీనివాసరావు, తాళం సోమ్‌బాబు, ఘంటా సాయి, రాయంకుల చక్రధర్ రావు, కేశవ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

19నుంచి ఐటీఐలలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 16 : జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేటు ఐటీఐలలో మొదటిదశ ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 21 వరకు ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ జరుగుతుందని అడ్మిషన్ల కన్వీనర్, ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. 19న ఉదయం 10గంటలకు మెరిట్ నెంబరు 1నుంచి 71వరకు, మధ్యాహ్నం 1గంటకు 72నుంచి 140 వరకు, 29న ఉదయం 141 నుంచి 224 వరకు, మధ్యాహ్నం 225 నుంచి 298వరకు, 21న ఉదయం 299 నుంచి 378వరకు, మధ్యాహ్నం 379 నుంచి 454వరకు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కార్యాలయ ఫోన్ నెంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.

సేవచేయడం అలవాటుగా మలచుకోవాలి

ఏలూరు రూరల్, జూన్ 16: తల్లిదండ్రులు ఇచ్చిన ప్యాకెట్ మనీతో వృద్ధులు, దివ్యాంగులకు, అనాథలకు సేవచేయడం అభినందనీయమని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవం రామకృష్ణాపురం ఓవర్‌బ్రిడ్జి వద్ద పేద కుటుంబాలు, అనాథలతో ఆదివారం నిర్వహించారు. పేదలు, అనాథలకు బియ్యం, నెలకు సరిపడా నిత్యావసరాలు, కూరగాయలు, పరుపులు, దోమ తెరలు, దుప్పట్లు, పేద విద్యార్థులకు స్కూల్‌బ్యాగులు, నోటుపుస్తకాలు, బిస్కెట్లు మేయర్ పంపిణీ చేశారు. కార్పొరేటర్ ఎస్.శ్రీనివాసరావు, హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపకులు షేక్ హఫీజ్, షేక్ సలీమ్, షరీఫ్, ఆలీ, షారూక్, గణేష్, అఖిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్రంథపఠనం అలవాటుగా మారాలి

పెదవేగి, జూన్ 16: గ్రంథపఠనం ఒక అలవాటుగా మారాలని, అది అభివృద్ధికి బాటలు వేస్తుందని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. విజ్ఞానదాయకమైన పుస్తక పఠనంతో లాభాలను విద్యార్థులకు వివరించారు.

పోలవరంలో ఉరుములు, మెరుపులు, చిరుజల్లులు

పోలవరం, జూన్ 16 : పోలవరం మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. ఓ మోస్తరు ఈదురుగాలులు వీచడంతో విద్యుత్ సరఫరా కొంతసేపు నిలిపివేశారు. వాతావరణం మేఘావృతమై చల్లబడింది. ఉదయం నుండి ఎండతీవ్రతకు ఇబ్బందులు పడిన ప్రజానీకానికి కొంత ఉపశమనం కలిగింది.

సైన్స్‌పార్క్ కోఆర్డినేటర్ చౌదరి పదవీ విరమణ

ఏలూరు టూటౌన్, జూన్ 16: జీఎంసీ బాలయోగి సైన్స్‌పార్కు కోఆర్డినేటర్ సీహెచ్‌ఆర్.మోహన చౌదరి పదవీవిరమణ చేశారు. ఆదివారం డీసీఎంఎస్ కన్వెన్షన్ హాలులో అభినందన కార్యక్రమానికి ఎమ్మెల్యే చంటి చౌదరి దంపతులను ఘనంగా సన్మానించారు. ఆర్అండ్‌ఆర్ నాగేశ్వరరావు, కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాపుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు టూటౌన్, జూన్ 16: జిల్లాలో కాపుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని కాపు సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారి నిరంజన్ అన్నారు. సంఘ కార్యాలయంలో నిరంజన్‌ను పలువురు కాపు నాయకులు సత్కరించారు. పులి శ్రీరాములు, ఎం.చంద్రశేఖర్, రాజు, భాస్కర్, నిమ్మలజ్యోతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు రూ.50 వేలు ప్రోత్సాహకం

బుట్టాయగూడెం, జూన్ 16: నీట్‌లో అత్యుత్తమ(705 మార్కులు) ప్రతిభ కనబరచిన గోపాలపురం మండలం రాంపాలెంకు చెందిన లంకలపల్లి సత్యవర్ధన్‌కు ఆదివారం బుట్టాయగూడెంలో రైతు సంఘం నాయకుడు కరాటం వెంకటరెడ్డినాయుడు రూ.50 వేల చెక్కును అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన క్రియేటివ్ ఆర్గానిక్స్ సంస్థ అధినేత శీలంశెట్టి కృష్ణమోహన్, సౌభాగ్యవతి దంపతులు రూ.50 వేలు అందించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రణాళిక

దెందులూరు, జూన్ 16: గ్రామాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు బాదంపూడి చారిటబుల్ ట్రస్టు సేవలు విస్తృతం చేస్తామని ట్రస్ట్ చైర్మన్ బాదంపూడి రమేష్‌బాబు తెలిపారు. ట్రస్టు వార్షికోత్సవం సందర్భంగా మేదినరావుపాలెం, ఏలూరు ఆటోనగర్, పాతబస్టాండ్ వద్ద ఆదివారం మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, వృద్ధులకు అల్పాహారం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు, జూన్ 16 : భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నారు. దెందులూరు, భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని విద్యుత్‌శాఖ ఈఈ నటరాజన్ ఆదివారం తెలిపారు.





మంత్రి నాదెండ్ల మనోహర్‌తో జనసేన జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల జనసేన నాయకులు

మంత్రి నాదెండ్ల మనోహర్‌తో జనసేన నేతల భేటీ

ఏలూరు కార్పొరేషన్, జూన్ 16: మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, నేతలు ఆదివారం తెనాలిలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఆశలతో కూటమికి పట్టం కట్టారని, వారి ఆశలకు అనుగుణంగా సేవలందించాలని చెప్పారు. ఇచ్చిన వాగ్దానాల అమలు దిశగా కూటమి ప్రభుత్వం ఉందన్నారు. పవన్‌కల్యాణ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడం వలన త్వరితగతిన హామీలు అమలవుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నగిరెడ్డి కాశీ నరేష్, వీరంకి పండు, రవి, నిమ్మల శ్రీను తదితరులు ఉన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావులకు అప్పలనాయుడు పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు అందచేశారు.

● దెందులూరు: మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను దెందులూరు మండల టీడీపీ నేతలు ఆదివారం తెనాలిలో కలిశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు మోతుకూరి నానిబాబు, యలమర్తి హేమశ్రీనివాస్, మంత్రి బంధువు యలమర్తి సత్యనారాయణ మంత్రి మనోహర్‌ను కలిసి పూలదండ వేసి బొకేలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ తన బంధువులు, స్నేహితుల యోగా క్షేమలను శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలసి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మనోహర్ తెలిపారు. పావులూరి దశరథరామయ్య, పలువురు టీడీపీ నేతలు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు,

● ఉంగుటూరు: మంత్రి నాదెండ్ల మనోహర్‌ను తెనాలిలోను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలసి అభినందించారు. నియోజకవర్గంలో సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు పాతూరి విజయకుమార్, పొత్తూరి కృష్ణంరాజు, చింతలపాటి బాపిరాజు, వంగా రఘు తదితరులు ఉన్నారు.


రాట్నాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి జూన్ 16: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు చేశారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.65,125, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.43,500, ఫొటో విక్రయాల ద్వారా రూ.4750 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి రూ.30,187 విరాళాలు అందించారని ఆయన చెప్పారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

దొండపాడులో ఆలయ నిర్మాణానికి శ్రీకారం

ఏలూరు కల్చరల్, జూన్ 16: దొండపాడులో బాల అయ్యప్ప క్షేత్రస్థలంలో ఇటీవల వేంకటేశ్వరస్వామి విగ్రహం దొరికింది. విగ్రహం దొరికిన స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మాణానికి చర్య లు చేపట్టారు. స్వామివారి విగ్రహం లభించిన స్థలం ప్రక్షాళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నాగలికట్టిన జోడెడ్లతో స్థలాన్ని దున్ని నవధాన్యాలు వేశారు. రుత్వికులు కె.నాగమోహనాచార్యులు బ్రహ్మోత్సవంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వడపర్తి వెంకట్, బండి సుధీర్, కె.వెంకటేశ్వరరావు, ఓలేటి గణేశ్వరరావు, సరస్వతికుమార్ పాల్గొన్నారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 16: పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు సామూహికంగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పుష్పాలు, తులసీదళాలతో అర్చనలు నిర్వహించారు. సూర్య నమస్కార పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆదిశర్మ భక్తులతో పూజలు చేయించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పి.అంకంపాలెంలో గంగానమ్మ జాతర

జీలుగుమిల్లి, జూన్ 16: పి.అంకంపాలెంలో గంగానమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు మొక్కులు చెల్లించారు. ఆదివారం నుంచి నెలాఖరు వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ దర్శించుకున్నారు. సర్పంచ్ బుద్దా జగ్గారావు, ఎంపీటీసీ నాలి శ్రీను, పేరాబత్తుల పున్నయ్య ఉన్నారు.

జిల్లా మందుల వర్తక సంఘం కమిటీ



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఏలూరు రూరల్, జూన్ 16: మందుల వర్తక సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుత్తా రవిచంద్ర, కార్యదర్శిగా వజ్రపు శేఖర్, కోశాధికారిగా టి.శివరామకృష్ణ ఎన్నిక అయ్యారు. జిల్లా నుంచి 25మండల నాయకులు, 500మంది సంఘసభ్యులు పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని వారు పేర్కొన్నారు.

సోమవారం.. పోదాం పోలవరం

(మూడో పేజీ తరువాయి)

పరిహారం మాటే ఎత్తకుండా వరదల కారణంగా నష్టపోయిన వారికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించి ఆ తర్వాత మొండిచెయ్యి చూపించారు. ఫలితంగా దాదాపు 15 వేల కుటుంబాలు అలో లక్ష్మణా అంటూ వాపోయాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబుకి ఆయా అంశాలపై ప్రత్యేక అవగాహన ఉన్నందున కనీసం ఈసారైనా తమ కష్టాలను తీర్చాలని నిర్వాసితులు కోరుకుంటున్నారు. ఉపాధి అవకాశాలు లేక తెలంగాణకు తరలివెళ్ళిన వందలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను సీఎం ఎదుట ప్రస్తావించాలని భావిస్తున్నారు. పోలవరం నియోజకవర్గం నుంచి కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు గెలుపొందారు. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసిత కుటుంబాలకు ఒకింత ధైర్యం వచ్చింది. తమ ఆర్థిక కష్టాలతోపాటు రోజువారి పని కల్పించగలరనే ధైర్యం కనిపిస్తోంది. తమ పెద్దలతో చంద్రబాబుకు విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

పోలవరం మళ్లీ కళకళ!

ఐదేళ్ల తర్వాత పోలవరం ప్రాజెక్టులో సందడి నెలకొంది. గడిచిన ఐదేళ్లుగా పనులు ముందుకు సాగక, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీల సంఖ్య మందగించడంతో పోలవరం అసలు లెక్కలో లేకుండా పోయింది. ఇప్పటికే దెబ్బతిన్న ట్విన్‌టన్నల్స్ నిర్మాణ పనులకు మళ్లీ జీవం వచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు సంబంధించి అనేక కీలక పరిణామాలపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)తో సహా కేంద్ర నిపుణుల బృందాల నివేదికల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డయాఫ్రమ్ వాల్ దెబ్బ తిన్నందున కొత్తది కట్టాలా.. వద్దా అనేది తేల్చాలి. కుంగిపోయిన గైడ్‌బండ్ విషయంలో నిపుణుల సలహాల మేరకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. విద్యుత్ కేంద్ర నిర్మాణ పనుల్లో కాంటాక్టు ఏజన్సీని పరుగులు పెట్టించాల్సి ఉంది. ఇవన్నీ నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్న సీఎం చంద్రబాబు స్వయంగా ఆయా పనులను పరిశీలించడమే కాకుండా ఉన్నత స్థాయి సమీక్షను ఇక్కడే నిర్వహించ బోతున్నారు. ప్రత్యేకించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు జల వనరుల శాఖ అప్పగించినందున ఇక పనుల్లోను త్వరితగతిన నిర్ణయాలు ఉంటాయని భావిస్తున్నారు.


మంత్రి పార్థసారథికి గజమాలతో సత్కారం


చనుబండ నుంచి నూజివీడుకు టీడీపీ శ్రేణుల బైక్ ర్యాలీ

మంత్రి సారథికి ఘన స్వాగతం

నూజివీడు, జూన్ 16: నూజివీడు ఎమ్మెల్యే రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంత్రి హోదాలో తొలిసారిగా ఆదివారం నూజివీడు విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. తొలుత ఆయన విజయవాడ నుంచి హనుమాన్ జంక్షన్ మీదుగా నూజివీడు నియోజకవర్గంలోకి ప్రవేశించారు. హనుమాన్ జంక్షన్‌లో అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహించి, అనంతరం ర్యాలీగా సీతారాంపురం గ్రామం నుంచి బయల్దేరి మర్రిబంధం, గొల్లపల్లి, మీర్జాపురం మీదుగా నూజివీడు పట్టణంలోకి ప్రవేశించారు. ప్రతి గ్రామంలో అడుగడుగునా ఆయనకు ప్రజలు నీరాజనాలు పలికారు. పట్టణ ప్రధాన కూడలి నుంచి ఆయనను ర్యాలీగా కార్యకర్తలు పార్టీ కార్యాలయం వరకు తీసుకుని వచ్చారు. పురపాలక కార్యాలయం వద్ద క్రేన్‌తో మంత్రి సారథిని గజమాలతో అధికారులు సత్కరించారు. పట్టణ వాణిజ్య సంఘాల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సారథికి ఘన సత్కారం జరిగింది.

ర్యాలీగా తరలిన శ్రేణులు..

ముసునూరు: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంత్రి హోదాలో తొలిసారి ఆదివారం నూజివీడు విచ్చేసిన నేపథ్యంలో ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు ముసునూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్ళారు. సీతారాంపురం నుంచి స్వాగత ర్యాలీ సాగింది.

చాట్రాయి: మంత్రి పార్థసారథిని స్వాగతించేందుకు చాట్రాయి మండలం నుండి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, విజయ డెయిరీ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, మండల నాయకులు బొట్టు లక్ష్మణరావు, పుచ్చకాయల నోబుల్‌రెడ్డి, మరిడి చిట్టిబాబు, పలగాని దుర్గారావు, కలకొండ బాస్కరరావు, తల్లాడ శ్రీనివాసరావు, మందలపు జగదీష్, నక్కా రాము, అంబటి సత్యనారాయణ, వెల్ది నాగేశ్వరరావు నూజివీడు తరలారు.


హనుమాన్ జంక్షన్‌లో అభయాంజనేయస్వామికి మంత్రి పూజలు


ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో సన్మానం

నూజివీడును అభివృద్ధి చేస్తా

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు, జూన్ 16: నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి తాను శాయశక్తులా కృషిచేస్తానని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం రాత్రి ఆర్యవైశ్య సంఘాల నేతృత్వంలో ఆయనకు ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూజివీడు పట్టణంలో ఇండోర్ స్టేడియంను ఈ ఏడాదే పూర్తి చేస్తానని, అలాగే నూజివీడు పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు, డ్రైనేజి సమస్యలను ఇప్పటికే సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు అందేలా ప్రభుత్వం కృషిచేస్తుతందన్నారు. అలాగే రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధిచేసి యువతకు ఉపాధి కల్పించే విధంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. తాను ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలు అమలుకు శక్తివంచనలేకుండా కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న నూజివీడును అభివృద్ధి పథంలో నడిపించటానికి కృషిచేస్తానన్నారు. తన గెలుపులో ఆర్యవైశ్యుల పాత్ర మరువలేనని ఆయన తెలుపుతూ వాణిజ్య వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. వ్యాపారులు, ఆర్యవైశ్య ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాలినడకన పెద్దతిరుపతికి తెలుగు తమ్ముళ్లు..



చాట్రాయి, జూన్ 16: కొలుసు పార్థసారథి నూజివీడు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి పదవి చేపట్టాలని, ఏలూరు ఎంపీగా పుట్టా మహేష్ యాదవ్ గెలుపొందాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవి స్వీకరించిన తరువాత కాలినడకన తిరుమల తిరుపతి శ్రీవారి దర్శనానికి వస్తామని, మండలంలోని మర్లపాలెం గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు మొక్కుకున్నారు. కోర్కెలు తీరటంతో ఆదివారం సాయంత్రం స్థానిక టీడీపీ నాయకులు వెల్ది రాజారావు, వెల్ది అప్పారావు ఆధ్వర్యంలో 10 మంది పెద్దద తిరుపతి బయలుదేరి వెళ్ళారు. సుమారు 500 కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి ఈ నెల 30వ తేదీకి తిరుమల చేరుకొని కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కు తీర్చుకుంటామని టీడీపీ నాయకులు చెప్పారు.

108 కొబ్బరికాయలు కొట్టి..



మండవల్లి, జూన్ 16: టీడీపీ శ్రేణులు చిన్న తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఎన్డీయే కూటమితో పాటు కైకలూరులో కామినేని గెలుపు సాధిస్తే 108 కొబ్బరికాయలు కొడతామని మొక్కుకున్న నాయకులు మండవల్లి మండలానికి చెందిన యాదవ సాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి తలారి రాజేష్ ఆధ్వర్యంలో చిన్న తిరుపతికి వెళ్లి స్వామిని దర్శించుకుని ఆలయం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. తలారి రాజేష్ మాట్లాడుతూ అరాచక వైసీపీ ప్రభుత్వం పోయి సంక్షేమ ప్రభుత్వం వచ్చిందన్నారు. కృష్ణాజిల్లా రజక సాధికార డైరెక్టర్ వీరవల్లి శివయ్య, బూత్ కన్వీనర్ గుడివాడ గణేష్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గుడపాటి లక్ష్మణరావు, బూత్ కన్వీనర్ తలారి పోతురాజు, ప్రేమ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలసిన ముద్దరబోయిన



నూజివీడు, జూన్ 16: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆదివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి లో రాష్ట్రాన్ని ప్రథమస్థానంలో నిలిపేసత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో సాగిన రాక్షసపాలన కూటమి ఉమ్మడిపోరుతో తుడిచిపెట్టుకు పోయిందని ఆయన అన్నారు.

సీఎంకు కలిదిండి బీసీ నేతల అభినందన



కలిదిండి, జూన్ 16 : నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును టీడీపీ కలిదిండి మండల బీసీ నేతలు మంగళగిరిలో కలిసి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్ల కాలంలో బీసీల సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. బీసీ నాయకులు అంద్రాజు దుర్గారావు, వడుగు గణపతి, తిరుమలశెట్టి పరశురాముడు, కొల్లాటి సత్య నారాయణ, వడుగు గోపాలరావు, కొల్లాటి మాల్రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలసిన 'కొత్త'



ముదినేపల్లి, జూన్ 16 : కైకలూరు నియోజకవర్గ రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్ కోరారు. మంత్రిగా నియమి తులైన రామానాయుడును ఆదివారం విజయవాడలో కలసి నాగేంద్ర కుమార్ అభినందనలు తెలిపారు. తూర్పు డెల్టాకు శివారున ఉన్న కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, మండవల్లి, కైకలూరు, కలిదిండి మండలాలతోపాటు పెడన నియోజకవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని ఆయకట్టుకు సకాలంలో సాగునీరందక రైతులు ప్రతి సార్వా సీజనులోనూ ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. కాల్వలకు త్వరగా సాగునీరు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

మంత్రి సారథికి టీడీపీ నాయకుల అభినందన



చాట్రాయి, జూన్ 16: రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథిని విజయవాడలో శనివారం రాత్రి పలువురు టీడీపీ నాయకులు కలసి అభినందించారు. నియోజకవర్గ తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి చాగంటి బుచ్చిబాబు, రాష్ట్ర కనీస వేతన మండలి మాజీ సభ్యుడు చాగంటి నరసింహారావు, నాయకులు మరిడి చిన్న అప్పారావు, యర్రా పెదరాయుడు, చిర్రా కోటేశ్వరరావు, గడ్డం కొండయ్య, ధర్మారావు తదితరులు కలిసి అభినందించారు.

మంత్రి రవీంద్రకు శుభాకాంక్షలు



కైకలూరు, జూన్ 16: ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు టీడీపీ కైకలూరు మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మచిలీపట్నంలో ఆయన ఇంటి వద్ద పార్టీ మండవల్లి మండల అధ్యక్షులు నారగాని నాగేశ్వరరావుతో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు అభిమానంతో భారీ మెజార్టీని అందించి గెలిపించారని వారి ఆశయాలకు తగినట్లుగా నాయకులంతా పనిచేయాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. కైకలూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రకీబా, కైకలూరు పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.

కామినేనికి పులపర్రు సర్పంచ్ పరామర్శ



మండవల్లి, జూన్ 16: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను మండవల్లి మండలం పుల్లపర్రు సర్పంచ్ మింద్రు నాగరాజు ఆదివారం పరా మర్శించారు. కామినేని అస్వస్థతకు గురయ్యారని తెలుసుకుని హైదరాబాదులో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ నెల 18 నుంచి కైకలూరు నియోజక వర్గంలో పర్యటించేందుకు వస్తున్నానని ప్రజలెవరూ హైదరాబాద్ రానవసరం లేదని డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలిపినట్లు నాగరాజు వివరించారు.

సోమవారం.. పోదాం పోలవరం

(మూడో పేజీ తరువాయి)

పరిహారం మాటే ఎత్తకుండా వరదల కారణంగా నష్టపోయిన వారికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించి ఆ తర్వాత మొండిచెయ్యి చూపించారు. ఫలితంగా దాదాపు 15 వేల కుటుంబాలు అలో లక్ష్మణా అంటూ వాపోయాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబుకి ఆయా అంశాలపై ప్రత్యేక అవగాహన ఉన్నందున కనీసం ఈసారైనా తమ కష్టాలను తీర్చాలని నిర్వాసితులు కోరుకుంటున్నారు. ఉపాధి అవకాశాలు లేక తెలంగాణకు తరలివెళ్ళిన వందలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను సీఎం ఎదుట ప్రస్తా వించాలని భావిస్తున్నారు. పోలవరం నియోజకవర్గం నుంచి కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు గెలు పొందారు. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసిత కుటుంబా లకు ఒకింత ధైర్యం వచ్చింది. తమ ఆర్థిక కష్టాలతోపాటు రోజువారి పని కల్పించగలరనే ధైర్యం కనిపిస్తోంది. వీలైతే తమ పెద్దలతో చంద్రబాబుకు విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్ని స్తున్నారు.

పోలవరం మళ్ళీ కళకళ!

ఐదేళ్ల తర్వాత పోలవరం ప్రాజెక్టులో సందడి నెలకొంది. గడిచిన ఐదేళ్లుగా పనులు ముందుకు సాగక, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీల సంఖ్య మందగించడంతో పోలవరం అసలు లెక్కలో లేకుండా పోయింది. ఇప్పటికే దెబ్బతిన్న ట్విన్‌టన్నల్స్ నిర్మాణ పనులకు మళ్ళీ జీవం వచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు సంబంధించి అనేక కీలక పరిణామాలపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)తో సహా కేంద్ర నిపు ణుల బృందాలు ఇచ్చిన నివేదికల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డయాఫ్రమ్‌వాల్ దెబ్బ తిన్నందున కొత్తది కట్టాలా.. వద్దా అనేది తేల్చాలి. కుంగిపోయిన గైడ్‌బండ్ విషయంలోను నిపుణుల సలహాల మేరకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. విద్యుత్ కేంద్ర నిర్మాణ పనుల్లోను కాంట్రాక్టు ఏజన్సీని పరుగులు పెట్టించాల్సి ఉంది. ఇవన్నీ నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్న సీఎం చంద్రబాబు స్వయంగా ఆయా పనులను పరిశీలించ డమే కాకుండా ఉన్నత స్థాయి సమీక్షను ఇక్కడే నిర్వహించబోతున్నారు. ప్రత్యేకించి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు జల వనరుల శాఖ అప్పగించినందున ఇక పనుల్లోను త్వరితగతిన నిర్ణయాలు ఉంటాయని భావిస్తున్నారు.


కైకలూరులో ముస్లీం పెద్దలతో మాట్లాడుతున్న టౌన్ సీఐ రఘు

ఇతరులకు ఇబ్బంది లేకుండా బక్రీద్ జరుపుకోవాలి

కైకలూరు, జూన్ 16: మత సామరస్యాన్ని పాటిస్తూ ఇతర మతాలకు ఇబ్బంది లేకుండా ఈ నెల 17న బక్రీద్ పండుగను జరుపుకోవాలని కైకలూరు టౌన్ సీఐ ఆకుల రఘు అన్నారు. కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో ముస్లిం పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మసీదు పెద్దలు సోషల్ మీడియా మాధ్యమాల్లో ఇతర మతాలకు సంబంధించిన పోస్టులు, పుకార్లను నమ్మవద్దని సూచించారు. శాంతియుత వాతావరణంలో ముస్లింలంతా బక్రీదు వేడుకలను జరుపుకోవాలని సూచించారు.

ముదినేపల్లి: బక్రీద్ పండుగను సంప్రదాయబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ముదినేపల్లి ఎస్ఐ వెంకట్ కుమార్ కోరారు. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ఆయన ముదినేపల్లిలోని మసీదు కమిటీ ప్రతినిధులతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సామరస్యంగా వ్యవహరించాలని ఎస్ఐ కోరారు. సమావేశంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ పతే అహ్మద్, ప్రతినిధులు షేక్ రియాజ్, సిద్దిక్, మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

జల జీవన్ పనుల పరిశీలన

ముదినేపల్లి, జూన్ 16 : జల జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ త్రినాథబాబు ఆదేశించారు. ముదినేపల్లి మండలం దాకరం, పేరూరు పంచాయతీలకు మంజూరైన జలజీవన్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న పైపులైన్ నిర్మాణానికి శనివారం ఆయన స్థల పరిశీలన చేశారు. పోల్‌రాజ్ ప్రధాన పంట కాల్వ వద్ద పంపింగ్ హౌస్ నిర్మాణం, పంట కాల్వ నుంచి మంచినీటి చెరువులకు డైరెక్ట్ పైపులైన్లను నిర్మించాల్సిన డిజైన్‌పై ఆయన కైకలూరు డీఈఈ శాస్త్రి, ముదినేపల్లి ఏఈ కృష్ణారావుతో చర్చించారు. పంట కాల్వ నుంచి పేరూరు, దాకరం, పంచాయతీ చెరువులకు నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్లను నిర్మించనున్నట్లు ఈఈ తెలిపారు.

వృద్ధుడి ఆచూకీ లభ్యం


ఇంటికి చేరుకున్న శ్రీరామరాజు

ముదినేపల్లి, జూన్ 16 : మండలంలోని దేవరంలో చేపల చెరువుపై కాపలా ఉంటూ ఈ నెల 13న అదృశ్యమైన అత్తిలికి చెందిన దండు శ్రీరామరాజు (76) అనే వృద్ధుడి ఆచూకీ లభ్యమైంది. చెరువు వద్ద తాడు తెంచుకుని పారిపోతున్న ఆవును పట్టుకునేందుకు వెళ్లిన ఆ వృద్ధుడు వడాలి గ్రామం వరకు వెళ్లి తిరిగిరాని విషయం తెలిసిందే. అక్కడ నుంచి దారి తప్పి చినగొన్నూరు మీదు గా గుడ్లవల్లేరు చేరుకొని శనివారం సాయంత్రం గుడివాడ చేరుకున్నాడు. గుడ్లవల్లేరులో ఆ వృద్ధుడి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు ప్రయత్నిస్తుండగా, ఫొటో చూసిన ఒక వ్యక్తి తెలిపిన సమాచారం మేరకు గుడివాడలో శ్రీరామ రాజును కనుగొని ఆదివారం సాయంత్రం దేవరంలోని ఇంటికి తీసుకొచ్చారు.

తీరనున్న పేదల ఆకలి

అన్న క్యాంటీన్లకు మోక్షం

పేద, బడుగు వర్గాల్లో ఆనందం

కైకలూరు, జూన్ 16: పేదల కడుపు నింపే అన్న క్యాంటీన్ సేవలు మళ్లీ అందనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లు నిర్వహించేందుకు సంతకాలు చేయడంపై పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో అన్న క్యాంటీన్ భవనాలు గాలికి వదిలివేయడంతో పనికి రాకుండా పోయాయి. వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. కైకలూరులో భవన నిర్మాణం 80 శాతం పూర్తయ్యేసరికి వైసీపీ ప్రభుత్వం రావడంతో నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. అప్పటికే ఏడాది కాలంగా కైకలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ నిర్వహణ సాగేది. భవన నిర్మాణం పూర్తి చేయకపోవడంతో క్యాంటీన్ ప్రాంగణం పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్‌లను జగన్ ప్రభుత్వం కక్షతో మూయించివేసింది. దీంతో నియోజకవర్గంలో ఉన్న ఏకైక క్యాంటీన్ కైకలూరు పట్టణంలో నిర్వహించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం దీనిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు పనులు ప్రారంభించడంతో రూ.5 లకే భోజనం పెట్టి పేదలు, బడుగుల ఆకలి తీర్చాలని చంద్రబాబు సంకల్పించారు. దీంతో తక్కువ ధరకే ఆహారం దొరుకుతుందని పేదలు, వ్యవసాయ కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కైకలూరులో నిర్మాణ దశలో అన్న క్యాంటీన్ భవనం


చింతలవల్లిలో నిర్మాణంలో ఉన్న శివాలయం

శరవేగంగా శివాలయ పునః నిర్మాణ పనులు

ముసునూరు, జూన్ 16: మండలంలోని చింతలవల్లిలో గంగా, పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం శరవేగంగా జరుగుతోంది. గ్రామంలో ఊరచెరువు మట్టితవ్వకాల్లో అతి పురాతన శివలింగం బయటపడటం, ఆ శివలింగానికి చిన్న ఆలయాన్ని ఏర్పాటుచేసి స్థానికులు నిత్యం పూజలు చేయటం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గ్రామస్థులు, దాతల సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మిస్తున్నారు. త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేసి శివలింగ పునఃప్రతిష్ఠ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు


వేల్పుచర్లలో రైతులకు విత్తనాలను అందజేస్తున్న వీహెచ్‌వో అనుపమ

ముసునూరు, జూన్ 16: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని, మండల వ్యవసాయా ధికారి ఎస్.మధు మోహన్ అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల్లో నాలుగు రకాల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. వేల్పుచర్ల, వలసపల్లిలో పంపిణీని ప్రారంభించామన్నారు. ఎంటీయూ - 1061 రకం 3120 కేజీలు, బీపీటీ -5204 రకం 600 కేజీలు, ఎమ్‌టీయూ - 1318 రకం 1350 కేజీలు, ఎమ్‌టీయూ 1064రకం 300కేజీల నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచామన్నారు. విత్తనాలను రైతులు ప్రభుత్వ అనుమతిలేని దుకాణాల్లో కొనుగోలు చేయటం వల్ల నాసిరకం విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాలతో పాటు ప్రభుత్వ లైసెన్స్‌లు ఉన్న దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను రైతులు కొనుగోలు చేసుకోవాలని, దీనికి సంబంధించిన బిల్లును, లేబుల్‌ను సైతం రైతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఏవో కోరారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సైతం రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటుందని ఏవో తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న కైకలూరు జనసేన నేతలు

బియ్యం కుంభకోణంపై విచారణ జరిపించండి

కైకలూరు, జూన్ 16: కైకలూరు సివిల్ సప్లై గోదాములో మూడేళ్ల క్రితం జరిగిన బియ్యం కుంభకోణంపై పూర్తిస్థాయిలో విచారణ చేసి దోషులకు శిక్ష పడేలా చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కైకలూరు జనసేన నాయకులు కోరారు. ఆదివారం విజయవాడలో మంత్రిని కలిసి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో కైకలూరులో బియ్యం కుంభకోణం జరిగిందని దానిపై అప్పుడే అధికారులు నామమాత్రంగా కేసులు నమోదు చేశారని వాటిని పూర్తిగా విచారించి దోషులకు శిక్ష పడేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. జనసేన కైకలూరు మండల అధ్యక్షుడు ముమ్మారెడ్డి నాగమల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరిపురపు రాజబాబు, షైగాపుల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రానివ్వద్దు



ముదినేపల్లి, జూన్ 16 : మండలంలో విద్యుత్ వినియోగదారులు సమస్యలు ఎదుర్కో కుండా చూడాలని టీడీపీ కైకలూరు నియోజక వర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ కోరారు. నియోజకవర్గంలో కూటమి ఘన విజయం సాధించడంతో వినోద్‌ను ఆదివారం స్థానిక ఎన్‌డీఏ కార్యాలయం వద్ద మండల విద్యుత్ ఏఈ పి.రవికుమార్ అభినందించారు. ఆక్వా రైతులతోపాటు గృహ విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా పాత విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర అంశాలపై దృష్టి పెట్టాలని వినోద్ ఏఈని కోరారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి, కైకలూరు నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించటం పట్ల ముదినేపల్లి మండల వీఆర్వోల సంఘం హర్షం వ్యక్తం చేసింది. సంఘ అధ్యక్షుడు కె.కిషోర్, ఉపాధ్యక్షుడు కె.కేశవ ఆధ్వర్యంలో మండలంలోని వీఆర్వోలు నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్‌ను కలసి అభినందించారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మండవల్లి, జూన్ 16: మండలంలోని షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం 14వ వార్షి కోత్సవం ఈ నెల 17 నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆలయ నిర్వహణ కమిటీ తెలిపింది. సోమవారం బాబాకు అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీరాంజీ గురువు నేతృత్వంలో హోమాల అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి అన్నసమారాధన జరుగుతుందన్నారు.

తాగునీటి చెరువు కలుషితం

మూల్లంకలో దాహం దాహం...


మూల్లంకలో కలుషిత నీటి చెరువు

కలిదిండి, జూన్ 16 : మండలంలో మూల్లంక తాగునీటి చెరువు నీరు కలుషితమైంది. చెరువు నీరు తీవ్ర దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. చెరువు నీరు 10 శాతం పైగా ఉప్పగా ఉండటంతో వాడుకోవటానికి కూడా ఉపయోగపడటం లేదని, స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలోని కలుషిత ఉప్పునీరు తూముల ద్వారా తాగునీటి చెరువులోకి ప్రవహించటం వల్లే కలుషితమైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తూములకు సక్రమంగా మూత వేయకపోవటం వల్లే చెరువులో నీరు కలుషితమైందని గ్రామస్థులు మండిపడుతున్నారు. చెరువు నీటిలో ఉప్పు శాతం అధికంగా ఉండటంతో తెల్ల చేపలకు కళ్లు మండి మృత్యువాత పడి పడుతున్నాయి. చనిపోయిన చేపలు తీవ్ర దుర్వాసన వెదజల్లటంతో వాటిని పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. కుండిల్లో సైతం చనిపోయిన చేపలు ఉండటంతో తాగునీరు జిగురు ఉంటుందని, తాగటానికి ఆమోద యోగ్యంగా లేకపోవటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లలో తాగునీరు కొనుగోలు చేసి తాగుతున్నామని వాపోతున్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలు, వృద్ధులు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. తాగునీటి చెరువు కలుషితమైనప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో సుమారు 5 వేల జనాభా నివశిస్తున్నారు. తాగటానికి, వాడుకోవటానికి చెరువులో నీరు కలుషితమయి ఉపయోగపడకపోవటంతో నరకయాతన పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే గ్రామం వదిలి సరిహద్దున ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు వలస వెళ్లిపోవాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికే పలువురు వలస వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి చెరువులో కలుషితమైన నీరు తొలగించి తాజా తాగునీరు పెట్టాలని, కాల్వలకు నీరు విడుదల చేయగానే ప్రాధాన్యత ఇచ్చి చెరువును పూర్తి స్థాయిలో నింపాలని ప్రజలు కోరుతున్నారు.